E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com




జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కేంద్ర పరిశీలకులు! » 2లో

(తేదీ) 29-09-2025 (వారం) సోమవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

## ఆసియా కప్ ట్రోఫీని తీసుకునేందుకు నిరాకరించిన భారత్



ఆసియా కప్ ఫైనల్‌లో దాయాది జట్టు పాకిస్థాన్‌పై భారత్ మరుపురాని విజయం సాధించింది. 41 ఏళ్ల ఆసియా కప్ టోర్నీ చరిత్రలోనే తొలిసారి ఫైనల్‌లో తలపడ్డ ఇరుజట్లలో.. టీమ్‌ఇండియాదే ఆధిపత్యం. నరాలు తెగే ఉత్కంఠ పోరులో.. » 6లో

# ఆసియా కప్ విజేతగా భారత్



*ఇది కదా అసలు సిసలు మజా అంటే.. ఆసియాకప్ ఫైనల్లోనూ దాయాది పాకిస్థాన్ ప్రత్యర్థిగా నిలిచిన వేళ.. ముచ్చటగా మూడోసారీ టీమిండియా తిరుగులేని పంచ్ ఇస్తుంటే.. అంతకు మించిన ఆనందం భారత క్రీడాభిమానికేముంటుంది. అయితే 146 పరుగుల స్వల్ప ఛేదనలో సూర్య సేన ఓ దశలో 20/3 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దెబ్బకు అందరికీ ఫలితంపై ఏ మూలో సందేహం. కీలక ఫైనల్లో తడబాటు తప్పదా? అనిపించింది. కానీ క్లిష్టంగా మారిన పిచ్‌పై తెలుగు తేజం తిలక్ వర్మ చూపిన తెగింపు వహ్వా అనిపించక మానదు. ఆఖరి ఓవర్ వరకు పట్టువదలగా నిలిచిన తను భారత్ ఖాతాలో తొమ్మిదో టైటిల్‌ను వేసి దేశాన్ని సంబరాల్లో ముంచాడు..*

- తిలక్ వర్మ వీరోచిత పోరాటం
- భారత్ ఖాతాలో ఆసియాకప్
- విశేషంగా రాణించిన స్పిన్నర్లు

తరువాయి 6లో



## ప్రమాదమా.. కుట్రా?



- తమిళనాడులోని కరూర్ ఘటనలో 40కి చేరిన మరణాలు
- ఘటనపై 24 గంటల్లో నివేదిక సమర్పించాలని గవర్నర్ ఆదేశం
- ఘటనకు భద్రతా వైఫల్యమే కారణమన్న అన్నాడీఎంకే
- బాధిత కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన విజయ్

తరువాయి 2లో

## నేడు స్థానిక నోటిఫికేషన్?



- ఎస్ఈసీ నోట్‌ఫైల్ సిద్ధం.. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు జిల్లాల రిజర్వేషన్ల జాబితాను అందజేసిన పీఆర్ఆర్‌డీ డైరెక్టర్
- జెడ్పీ సీఈవోలు, డీపీఓల నుంచి పీఆర్ కమిషనరేట్‌కు చేరిన రిజర్వేషన్లు

తరువాయి 2లో


## ప్రేమ విహారం

» 5లో



## వంటగ్యాస్‌కూ పోర్టబిలిటీ!

» 4లో



# న్యూయార్క్‌ను మరిపించేలా



- ఫ్యూచర్ సిటీ నిర్మాణం.. ప్రపంచం అబ్బురపడేలా చేస్తాం
- విదేశాల గురించి ఇంకెన్నాళ్లు మాట్లాడుకుందాం?
- బయటి దేశాలవారు గొప్పగా చెప్పకొనేలా చేస్తా
- పదేళ్లలో ఫార్చ్యూన్ కంపెనీలన్నీ ఫ్యూచర్ సిటీలోనే
- రైతులకు అభ్యంతరాలుంటే మాట్లాడుకుందాం
- రియల్ ఎస్టేట్ కోసమే అంటూ నాపై విమర్శలు
- పార్టీల ఉచ్చులో పడి కోర్టులకెళ్లి నష్టపోవద్దు

ఈకబురు, హైదరాబాద్: భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచం అబ్బురపడేలా నిర్మిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. న్యూయార్క్‌ను మరిపించే నగరాన్ని కడతామన్నారు. దుబాయి, న్యూయార్క్, టోక్యో, సింగపూర్ వంటి ప్రాంతాలకు వెళ్లివచ్చి అద్భుతంగా ఉన్నాయంటూ ఇంకెన్నాళ్లు గొప్పగా చెప్పుకొంటామని ప్రశ్నించారు. మన ప్రాంతం గురించి బయటి దేశాలవారు గొప్పగా చెప్పుకొనేలా చేయాలన్నదే తన సంకల్పమని ప్రకటించారు. అందుకే భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించాలని, ప్రపంచమంతా దీనివైపే చూసేలా చేయాలని తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రానున్న పదేళ్లలో ప్రపంచంలో ఉండే ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఈ సిటీలో ఉండాలన్నదే లక్ష్యమని చెప్పారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి, గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ 1 నిర్మాణాలకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ''ఫ్యూచర్ సిటీని గొప్ప నగరంగా తీర్చి

తరువాయి 2లో

# ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తును ఆపుతావా?

- కృష్ణానదిపై కర్ణాటక కుట్రను నిలువరించే దమ్ముందా?
- నల్లమల పులిగా చెప్పుకునే సీఎం రేవంత్ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి
- రాహుల్‌గాంధీ తనను ఎప్పుడు తీసేస్తాడోనన్న భయంలో ఉన్నాడు
- ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కాదు.. కాంగ్రెస్, బీజేపీ జాయింట్ వెంచర్ ప్రభుత్వం
- సీఎం సొంత గడ్డ నుంచే స్థానిక ఎన్నికల శంఖారావం
- అచ్చంపేటలో బీఆర్ఎస్ జనగర్జన బహిరంగ సభలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తరువాయి 2లో



## అక్టోబర్ 2న ఖాదీ వస్త్రాలే ధరించండి: మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ

ఈ-కబురుకసిత్ భారత్' లక్ష్య సాధనకు దేశ ప్రజలు స్వయం సమృద్ధి బాటలో నడవడం తప్పనిసరని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇందుకోసం స్వదేశీ తయారీ ఉత్పత్తులే విక్రయించాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మన్‌కీ బాత్ 126వ కార్యక్రమంలో ఆదివారం మోదీ మాట్లాడుతూ.. అక్టోబర్ 2న గాంధీ జయంతి ని పురస్కరించుకొని ప్రజలంతా ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి.. ధరించాలని కోరారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో స్వదేశీ ఉత్పత్తులపై మహాత్మా గాంధీ ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించారన్నారు. కాలక్రమంలో ఖాదీకి ప్రజాదరణ క్షీణించినప్పటికీ.. గత 11 ఏళ్లుగా మళ్లీ ఖాదీ ఉత్పత్తి పెరిగిందని అన్నారు.

తరువాయి2లో

# తగ్గిన వరద.. తెరుచుకున్న ఎంజీబీఎస్

ఈకబురు,హైదరాబాద్ న్యూస్‌టుడే, బేగంబజార్, బోధన్ గ్రామీణం, పాపన్నపేట, నార్సింగి, బండ్లగూడజాగీర్: రెండురోజులపాటు హైదరాబాద్ నగరాన్ని వణికించిన మూసీ నది ఆదివారం శాంతించింది. జంట జలాశయాలకు ఎగువ ప్రాంతం నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో హెచ్‌ఎండీఏ అధికార యంత్రాంగంఊపిరి పీల్చుకుంటోంది. ఆదివారం సాయంత్రానికి ఉస్మాన్‌సాగర్(గండిపేట) 4 గేట్లు 2 అడుగుల మేర, హిమాయత్‌సాగర్ 2 గేట్లు 3 అడుగుల మేర ఎత్తి.. 2,901 క్యూసెక్కుల నీటిని మూసీలోకి వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఎగువ నుంచి ఉస్మాన్‌సాగర్‌లోకి 1,200, హిమాయత్‌సాగర్‌లోకి 3,000 క్యూసెక్కుల వరద చేరుతోంది. బాపూఘాట్ నుంచి మూసారంబాగ్ వరకు ఇరువైపులా మునిగిన కాలనీల్లో.. బల్దియా, జలమండలి, ఇతర విభాగాలు సహాయ చర్యలు చేపట్టాయి. రహదారులు, కాలనీల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, బురదను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. వంతెనల సమీపంలోని రహదారులన్నీ ధ్వంసమయ్యాయి. చాదర్‌ఘాట్, మూసారంబాగ్ వంతెనల రక్షణ గోడలు కొట్టుకుపోవడంతో పూర్తిగా పరిశీలించిన తర్వాతే రాకపోకలకు అనుమతిస్తామని అధికారులు తెలిపారు. ప్రవాహంలో కొట్టుకొచ్చిన వ్యర్థాల గుట్టలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. మరోవైపు మూసీ వరద ఉద్ధృతి తగ్గడంతో ఎంజీబీఎస్ తెరుచుకుంది. బస్‌స్టేషన్‌లో పేరుకుపోయిన బురద, వ్యర్థాలను ఆర్టీసీ సిబ్బంది తొలగించడంతో బస్సు సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. పండగ నేపథ్యంలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచే బస్టాండు ప్రయాణికులతో కిటకిటలాడింది. శుక్రవారం రాత్రి భారీ వరద ముంచెత్తడంతో ఎంజీబీఎస్ నీట మునిగిన సంగతి తెలిసిందే. జిల్లాలకు వెళ్లే బస్సు సర్వీసులు ఆదివారం ఉదయం వరకు ఆరాంఘర్, ఎల్బీనగర్, ఉప్పల్, జేబీఎస్‌ల నుంచే రాకపోకలు సాగించాయి. ఏడుపాయల ఆలయ మండపం పై భాగాన్ని తాకుతూ వెళ్తున్న వరదప్రమాదకర స్థాయిలో మంజీరా ప్రవాహం నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం హంగర్గ గ్రామాన్ని ఆదివారం మళ్లీ వరద చుట్టుముట్టింది. మహారాష్ట్ర నుంచి వస్తున్న వరదతో మంజీర, గోదావరి నదులు పోటెత్తి ప్రవహిస్తున్నాయి. ఫలితంగా శ్రీరామసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. ప్రాజెక్టు వెనుకజలాల కారణంగా హంగర్గలోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద చేరింది. అధికారులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో 100కుపైగా కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వెనుకజలాల కారణంగా ఆగస్టు 29వ తేదీన కూడా ఈ గ్రామాన్ని వరద ముంచెత్తింది. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఎన్కెపల్లి నుంచి మంజీరా నది ఏడుపాయల మీదుగా కొంపల్లి వరకు మహోగ్రరూపం దాల్చింది. ఏడుపాయల వనదుర్గ ఆలయం మండపం పైభాగాన్ని తాకుతూ వరద ప్రవహిస్తోంది. క్యూలైన్‌పై ఉన్న రేకులు కొట్టుకుపోయాయి. ఏడుపాయల మూడో వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో మెదక్ వైపు రెండుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. మండలవాసులు రంగంపేట మీదుగా మెదక్ వెళ్తున్నారు. మంజీరా పరీవాహక గ్రామాల్లోని వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఆదివారం వనదుర్గా ప్రాజెక్టు నుంచి.. 2016లో నమోదైన వరద రికార్డును మించి 1,24,598 క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహిస్తోంది.రేపు మరో ఉపరితల ఆవ్తనం అండమాన్ సముద్ర ప్రాంతంలో ఈ నెల 30 నాటికి ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణశాఖ సూచించింది. ఈ ప్రభావంతో మధ్య బంగాళాఖాతంలో అక్టోబరు 1న అల్పపీడనం ఏర్పడవచ్చని పేర్కొంది. మరోవైపు దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి ఉత్తర కోస్తాంధ్ర మీదుగా బంగాళాఖాతం వరకు ఆదివారం ఒక ద్రోణి ఏర్పడినట్లు సూచించింది. వీటి ఫలితంగా సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. ఆదివారం హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు నమోదయ్యాయి.



మొదటి పేజీ తరువాయి

## పచ్చదనంలో ప్రగతి దిశగా..!



సోమవారం హైదరాబాద్: ఎనిమిదేళ్లలో తెలంగాణ అటవీ విస్తీర్ణం పెరిగింది. రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణం 1.12 లక్షల చ.కి.మీ. కాగా.. ఇందులో 2015 నాటికి 26,904 చ.కి.మీ. ఉన్న అటవీ విస్తీర్ణం 2023 నాటికి 27,688 చ.కి.మీ.కి (2.91%) పెరిగింది. ఎనిమిదేళ్లలో రాష్ట్రంలో 784 చ.కి.మీ. మేర అటవీ విస్తీర్ణం పెరిగినట్లు 'ఇండియన్ స్టేట్ ఆఫ్ ఫారెస్ట్' తాజా నివేదిక వెల్లడించింది. అయితే పర్యావరణ పరిరక్షణకు దోహదపడే అడవుల్లోని కార్బన్ నిల్వలు తగ్గాయి. ఇది ఒకింత ఆందోళనకరమేనన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. నివేదికలోని ముఖ్యాంశాలివి..

ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా వర్గీకరణ ప్రకారం.. 2013-14లో 513 చ.కి.మీ.గా ఉన్న అత్యంత దట్టమైన అడవుల విస్తీర్ణం 2021-22లో 1,613.32 చ.కి.మీ.కి (214%) పెరిగింది. ఇదే సమయంలో మధ్యస్థ అడవుల విస్తీర్ణం 12,712 చ.కి.మీ నుంచి 8,909.9 కి.మీ.కి (29.91%) తగ్గింది. ఓపెన్ ఫారెస్ట్ ప్రాంతం 8,366 చ.కి.మీ. నుంచి 10,655 చ.కి.మీ.కి (27.37%) పెరిగింది. అలాగే అతి తక్కువ సాంద్రత ఉండే 'స్క్రబ్' అటవీ ప్రాంతం 1,874 చ.కి.మీ. నుంచి 2,829.88 చ.కి.మీ.కి (51%) పెరిగింది.

నిర్దేశిత ప్రాంతంలోని చెట్ల సంఖ్యను తెలిపే 'గ్రోయింగ్ స్టాక్' 2015లో 57 మిలియన్ క్యూబిక్ మీటర్లు కాగా 2023 నాటికి అది 85 మిలియన్ క్యూబిక్ మీటర్లకు పెరిగింది.

'కార్బన్ స్టాక్' తగ్గుదల..

ఆరేళ్ల వ్యవధిలో రాష్ట్రంలో అడవులు నిల్వచేసే కార్బన్ (కార్బన్ స్టాక్) 12.57 శాతం క్షీణించింది. 2017లో 185 మిలియన్ టన్నులుగా ఉన్న కార్బన్ స్టాక్ 2023 నాటికి 162 మి.టన్నులకు తగ్గింది.

'కార్బన్ స్టాక్' తగ్గితే వాతావరణ సమస్యలు వేగంగా పెరుగుతాయి. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ పెరుగుతుంది. ఫలితంగా గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు పెరుగుతాయి. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. చెట్లలో కార్బన్ నిల్వ ఎక్కువగా ఉంటే వాతావరణంలోకి వెళ్లే కార్బన్ డై ఆక్సైడ్ తగ్గుతుంది. అడవుల్లో అగ్నిప్రమాదాలు, అటవీ ఆక్రమణలు, అభివృద్ధి ప్రాజెక్టుల కోసం చెట్లను నరకడం, పశువులమేత కోసం చిన్న మొక్కల్ని పెరగనివ్వకపోవడం వంటి అంశాలు కార్బన్ స్టాక్ తగ్గుదలకు కారణాలవుతున్నాయి.

మొదటి పేజీ తరువాయి

## ఈ పల్లె నిండా.. ఇక సౌర వెలుగులే..!



**దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా..**

**సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లి ప్రత్యేకం**

**నెలలో గ్రామస్థులకు రూ.5 లక్షల ఆదాయం**

ఈ-కబురు, హైదరాబాద్: దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా.. ఆ పల్లె సంపూర్ణ సౌరవిద్యుత్ కాంతులీననుంది. అదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలంలో ఉన్న ఈ గ్రామంలోని మొత్తం 514 ఇళ్లతోపాటు 11 ప్రభుత్వ భవనాలపై రూ.10.53 కోట్లతో సౌరవిద్యుత్ ఏర్పాటు పనులను 'తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీజీరెడ్కో)' చేపట్టింది. ఈ పనులు దాదాపు పూర్తయ్యాయి.ప్రతి ఇంటిపై 3 కిలోవాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో ఇప్పటికే 480 ఇళ్లపై సౌరఫలకాల ఏర్పాటు పూర్తయింది. 60 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌరవిద్యుత్ పరికరాలను 11 ప్రభుత్వ భవనాలపై బిగించారు. ఇప్పటికే గ్రామంలో ఏర్పాటు చేసిన మొత్తం సౌరవిద్యుత్ స్థాపిత ఉత్పత్తి సామర్థ్యం 1,500 కిలోవాట్లకు చేరింది. మట్టిగోడలతో ఉన్న మరో 34 ఇళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే, వాటిపైనా సౌర ఫలకాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయంలో కేంద్రం నుంచి రూ.3.56 కోట్ల రాయితీ మంజూరవుతుంది. ప్రీమియర్ ఎనర్జీస్ కంపెనీ సీఎస్సార్ కింద రూ.4.09 కోట్లు భరించింది. మిగిలిన మొత్తాన్ని మౌలిక వసతుల అభివృద్ధికి అధికారులు ఖర్చు చేశారు.

ప్రతి ఇంటిపైనా 360 యూనిట్ల ఉత్పత్తి..ప్రతి ఇంటిపైనా నెలకు 360 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) సీఎండీ ముషారఫ్ 'ఈనాడు'కు తెలిపారు. ఇందులో ఇంటి వినియోగానికిపోగా, మిగిలిన కరెంటును గ్రిడ్‌కు సరఫరా అయ్యేలా అనుసంధానం చేసినట్లు వివరించారు. ఈ మేరకు యూనిట్‌కు రూ.5.25 చొప్పున ఇంటి యజమానికి చెల్లించడానికి విద్యుత్ పంపిణీ సంస్థ ఒప్పందం చేసుకున్నట్లు రెడ్కో ఎండీ అనిల చెప్పారు. ఈ నెలలో లక్ష యూనిట్లను గ్రిడ్‌కు సరఫరా చేయడంతో రూ.5 లక్షలకు పైగా ఆదాయాన్ని గ్రామస్థులు ఆర్జించినట్లు ఆమె వివరించారు. ఈ ప్రాజెక్టు పనులను మంత్రులు దామోదర్ రాజనర్సింహా, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ఆదివారం పరిశీలించగా.. వారికి ముషారఫ్, అనిల వివరాలు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## రూ.334 కోట్లమేర అవినీతి.. చైనా మాజీ మంత్రికి మరణశిక్ష!



ఈ-కబురు, అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న చైనా.. కట్టడిచర్యల్లో భాగంగా తాజాగా వ్యవసాయ, గ్రామీణ వ్యవహారాలశాఖ మాజీ మంత్రి టాంగ్ రెన్‌జియాన్‌కు మరణశిక్ష విధించింది. రూ.334 కోట్ల మేర లంచాలు తీసుకున్న వ్యవహారంలో ఆయన (Tang Renjian)పై ఈ మేరకు చర్యలు తీసుకుంది. అదేవిధంగా ఆయన రాజకీయ కార్యకలాపాలపై జీవితకాల నిషేధం విధిస్తూ.. జిలిన్ ప్రావిన్స్‌లోని కోర్టు తీర్పు చెప్పింది. ఆయన వ్యక్తిగత ఆస్తులను జప్తు చేయాలని, లంచం సొత్తునూ స్వాధీనం చేసుకుని దేశ ఖజానాకు అప్పగించాలని ఆదేశించింది.

టాంగ్ రెన్‌జియాన్ 2007-24 మధ్యకాలంలో అధికార దుర్వినియోగం చేస్తూ.. వ్యాపారాలు, కాంట్రాక్టులు, ఉద్యోగాల వంటి విషయాల్లో అవకతవకలకు పాల్పడినట్లు కోర్టు పేర్కొంది. బదులుగా 268 మిలియన్ యువాన్లకు (రూ.334 కోట్ల)పైగా నగదు, విలువైన వస్తువులను స్వీకరించినట్లు ప్రభుత్వ వార్తాసంస్థ పేర్కొంది. కేసు విచారణ సమయంలో టాంగ్ తన నేరాన్ని అంగీకరించారు. ఈ క్రమంలోనే కోర్టు ఆయనకు మరణశిక్ష విధించింది. అయితే.. విచారణకు సహకరించిన అంశాన్ని పరిగణనలోకి తీసుకుని శిక్ష అమలును రెండేళ్లపాటు నిలిపివేసింది.

ట్రంప్‌నకు పెట్టె చూపించి.. బుట్టలో వేసుకొని

చైనా అధ్యక్షుడిగా జిన్‌పింగ్ 2012లో అధికారంలోకి వచ్చిన అనంతరం పాలక కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా (CPC).. భారీ అవినీతి నిరోధక ఉద్యమం చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటివరకు పది లక్షల మందికిపైగా అధికారులపై చర్యలు తీసుకుంది. ఇందులో ఉన్నతస్థాయి సైనిక అధికారులు కూడా ఉన్నారు.

## రెగ్యులర్‌వే... ప్రత్యేకంగా!!



సోమవారం హైదరాబాద్: బతుకమ్మ, దసరా పండగలకు ప్రజలు భారీ సంఖ్యలో సొంతూర్లకు ప్రయాణం అవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు రద్దీగా మారాయి. ఆదివారం ఉదయం నుంచే హైదరాబాద్ నుంచి బయల్దేరే బస్సుల్లో భారీగా రద్దీ నెలకొంది. ప్రయాణికులను గమ్యానికి చేర్చాలన్న లక్ష్యంతో హైదరాబాద్‌లోని సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్ సర్వీసులను ఆర్టీసీ.. జిల్లాలకు ప్రత్యేక సర్వీసులుగా నడిపిస్తోంది. పల్లె ప్రాంతాల నుంచి పట్టణాలు, జిల్లా కేంద్రాలకు నడిపే పల్లె వెలుగు బస్సులనూ ప్రత్యేక సర్వీసులుగా నడుపుతోంది. ప్రత్యేక సర్వీసులకు అదనపు ఛార్జీలు వసూలు చేస్తోంది.

రెగ్యులర్ బస్సులనూ 'స్పెషల్' బోర్డులతో నడిపిస్తూ బేసిక్ ఫేర్‌పై 50 శాతం అదనపు ఛార్జీల్ని వసూలు చేస్తోంది. బస్టాప్‌లోకి రావడం ఆలస్యం..వచ్చిన బస్సు వచ్చినట్లు నిండిపోతోంది. తోపులాటలు, బస్సులోకి ఎక్కాక అదనపు ఛార్జీలు చూసి వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రయాణికుల నుంచి డిమాండ్ భారీగా ఉండడంతో ప్రైవేటు ఆపరేటర్లు కూడా సొమ్ము చేసుకుంటున్నారు.

నష్టాల్లో ఉన్నప్పుడు సాధారణ ఛార్జీలే

ఆర్టీసీ భారీగా నష్టాల్లో ఉన్నప్పుడు సైతం పండగల సమయంలో ప్రత్యేక బస్సుల్లోనూ ఆర్టీసీ సాధారణ ఛార్జీలనే వసూలుచేసింది. సంస్థ లాభాల బాటలోకి వచ్చిన తర్వాత పండగ సమయాల్లో ప్రత్యేక బస్సులపై అదనపు ఛార్జీలు వేస్తుండటం గమనార్హం. రైల్వేశాఖ పండగలప్పుడు వందల సంఖ్యలో ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నప్పటికీ సాధారణ ఛార్జీలే వసూలు చేస్తోంది. 202425లో మొత్తం 9,413 బస్సులుంటే రోజూ 8,830 నడిపేవారు. మిగతా 583 బస్సులు స్పేర్‌లో ఉండేవి. కానీ అంతకుమించిన సంఖ్యలో ఇప్పుడు ప్రత్యేక బస్సులుగా రోడ్డెక్కుతున్నాయి. శని, ఆదివారాల్లోనే 2,038 ప్రత్యేక బస్సులకు ఆర్టీసీ ప్రణాళిక రూపొందించగా..ఆయా రీజియన్లు, డిపోల అధికారులు అంతకంటే ఎక్కువ సంఖ్యలోనే ప్రత్యేక బస్సులు నడిపించారు. సోమ, మంగళ, బుధవారాల్లో మరో 2,500కి పైగా ప్రత్యేక బస్సులకు ప్రణాళికలు రూపొందించారు. ఉప్పల్‌లో వరంగల్ వైపు వెళ్లే బస్సుల్ని పరిశీలించగా సింహభాగం ప్రత్యేక బస్సులే కనిపించాయి. హైదరాబాద్‌హనుమకొండ రాజధాని బస్సులు ఆరు రాగా, అందులో నాలుగింటికి 'స్పెషల్' సర్వీసు స్టిక్కర్ ఉంది.

అదనపు కష్టాలు

ఎక్కడైనా ఛార్జి పెరిగితే సేవలు, నాణ్యత పెరుగుతాయి. ప్రత్యేక బస్సుల్లో భిన్నమైన పరిస్థితి. హైదరాబాద్ నుంచి వందల కిమీ దూరానికి సిటీ బస్సులను ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులుగా నడిపిస్తోంది. అంతదూరానికి సౌకర్యంగా కూర్చునేందుకు ఈ బస్సులు అనువుగా ఉండవు. జిల్లా బస్సులకు ఒకే డోర్, దానికి తలుపు ఉంటుంది. సిటీ బస్సుల్లో ముందు, వెనుక రెండు డోర్లుంటాయి. తలుపులు ఉండవు. దీంతో వాటిలోంచి వచ్చే చల్లటి గాలులతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని బస్సులకు మాత్రం వెనుక డోర్‌ను మూసేసి నడిపిస్తున్నారు.

# వంటగ్యాస్‌కూ పోర్టబిలిటీ!



వంటగ్యాస్ సిలిండర్ (ఎల్‌పీజీ) సరఫరా చేస్తున్న కంపెనీ/ఏజెన్సీ సేవలపై అసంతృప్తిగా ఉన్నారా.. అయితే వీటిని మార్చుకునే వీలు కలగనుంది. ఒక కంపెనీ సిమ్‌కార్డు తీసుకున్నా, ఆ మొబైల్ నెట్‌వర్క్ సరిగా అందుబాటులో లేకపోతే.. నంబరు కొనసాగిస్తూనే, నెట్‌వర్క్ కంపెనీని మార్చుకునే సౌలభ్యం (మొబైల్ నంబర్ పోర్టబిలిటీ) ఇప్పటికే వినియోగదారులకు అందుబాటులో ఉంది. ఇదే తరహాలో వంటగ్యాస్ కంపెనీని కూడా మార్చుకునే వీలును వినియోగదార్లకు కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో స్థానిక గ్యాస్ డీలర్ వల్ల అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నా, పరిమిత ప్రత్యామ్నాయాలు మాత్రమే వినియోగదారులకు ఉంటున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే ఇంధన నియంత్రణ సంస్థ పీఎన్‌జీఆర్‌బీ (పెట్రోలియం అండ్ నాచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డ్) ప్రజలు, పంపిణీదార్లు, సామాజిక సంస్థల నుంచి సూచనలు, సలహాలు ఆహ్వానిస్తోంది. గ్యాస్ సిలిండర్ ధర ఏ కంపెనీది అయినా ఒకటే కనుక, తమకు అనువైన డీలర్/కంపెనీని ఎంచుకునే స్వేచ్ఛ వినియోగదారులకు కల్పించాలన్నదే ఉద్దేశం.

డీలర్‌ను మార్చుకునేందుకు 2013లో అనుమతులు: ఎల్‌పీజీ పోర్టబిలిటీ ప్రక్రియను 2013 అక్టోబరులో ప్రయోగాత్మకంగా 13 రాష్ట్రాల్లోని 24 జిల్లాల్లో చేపట్టారు. 2014 జనవరిలో దీన్ని దేశవ్యాప్తంగా 480 జిల్లాలకు విస్తరించారు. అయితే అప్పుడు ఒక కంపెనీ పరిధిలో డీలర్‌ను మాత్రమే మార్చుకునేందుకు అనుమతించారు. అంటే ఇండియన్ ఆయిల్ నుంచి ఇండేన్ గ్యాస్ సేవలు పొందుతున్నవారు, తమ డీలర్‌ను మాత్రమే మార్చుకోగలరు కానీ, భారత్ పెట్రోలియంకు చెందిన భారత్ గ్యాస్/హిందుస్థాన్ పెట్రోలియంకు చెందిన హెచ్‌పీ గ్యాస్‌కు మారే వీలు కల్పించలేదు. ఏ కంపెనీ గ్యాస్ సిలిండర్‌ను అదే కంపెనీకి రీఫిల్లింగ్ కోసం ఇవ్వాల్సి ఉండటం ఇందుకు నేపథ్యం. కంపెనీని మార్చుకునే సౌలభ్యమూ వినియోగదారులకు ఇవ్వాలన్నది తాజా ప్రతిపాదన


# నవంబరులో ముడి చమురు ఉత్పత్తి మరింత పెంపు!




ఒపెక్+ దేశాలు నవంబరు నుంచి ముడి చమురు ఉత్పత్తి మరింత పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రోజుకు కనీసం 1,37,000 బ్యారెళ్ల ముడి చమురు ఉత్పత్తి పెంచాలనుకుంటున్నాయని సమాచారం. అక్టోబరు 5న ఈ ప్రణాళికను ప్రకటించే అవకాశం ఉందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు పేర్కొన్నాయి. కొవిడ్ పరిణామాల్లో గిరాకీ తగ్గడంతో, ధరల్లో స్థిరత్వం తెచ్చేందుకు ముడిచమురు ఉత్పత్తిని ఒపెక్+ దేశాలు తగ్గించాయి. మళ్లీ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి చమురు ఉత్పత్తి పెంచే వ్యూహాన్ని అమలు చేస్తున్నాయి. రోజుకు 2.5 మిలియన్ బ్యారెళ్ల (ప్రపంచ గిరాకీలో 2.4 శాతానికి సమానం) ఉత్పత్తిని ఇప్పటికే పెంచాయి. నవంబరు నుంచి రోజుకు మరో 1,37,000 బ్యారెళ్ల ఉత్పత్తిని పెంచేందుకు రంగం సిద్ధమవుతోంది. ముడి చమురు ధరలు తగ్గేలా చూడాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ఒత్తిడికి తలొగ్గడంతో పాటు, విపణిలో తమ మార్కెట్ వాటా పెంచుకునేందుకే ఒపెక్+ దేశాలు ఈ నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ప్రపంచ చమురు గిరాకీలో 50 శాతాన్ని ఒపెక్+ దేశాలే తీరుస్తున్నాయి.

# మన వడ్డీరేట్లు..

## అమెరికా టారిఫ్‌లే దారిచూపుతాయ్



**సూచీలు నష్టపోయేందుకు వీలు**
**ఐటీ, సిమెంటు షేర్లకు ప్రతికూలతలు**
**విశ్లేషకుల అంచనాలు**
**అక్టోబరు 2న మార్కెట్లకు సెలవు**
**స్టాక్ మార్కెట్**

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారమూ నష్టపోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నిఫ్టీ50 సూచీ 25,90025,800 స్థాయులను కోల్పోవడం ఇందుకు నేపథ్యమని పేర్కొంటున్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన వార్తలు ప్రభావం చూపుతాయి. ఈ నేపథ్యంలోనే బ్రాండెడ్ ఫార్మా ఉత్పత్తులపై 100% టారిఫ్ విధించడం కలవరపరచింది. డాలర్‌తో పోలిస్తే, రూపాయి కనిష్ఠ స్థాయికి చేరడంతో మార్కెట్లో అప్రమత్తత పెరిగింది. ఆర్‌బీఐ పరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాల (సెప్టెంబరు 29అక్టోబరు 1) కోసం వేచిచూడాలి. కీలక రేట్లు మార్చకపోవచ్చని కొందరు నిపుణులు పేర్కొంటుండగా, ద్రవ్యోల్బణం తక్కువగా ఉన్నందున 25 బేసిస్‌పాయింట్ల కోతకు అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా వేస్తోంది. నిఫ్టీ 50కి 24,60024,400 వద్ద మద్దతు, 24,80024,900 వద్ద నిరోధం ఉండొచ్చని.. అయితే 24,000 పాయింట్ల దిగువకు వెళ్లకపోవచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. దసరా, గాంధీజయంతి సందర్భంగా అక్టోబరు 2న సెలవు కావడంతో, ఈవారం మార్కెట్లు నాలుగు రోజులే పనిచేయనున్నాయి. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..హెచ్1బీ కొత్త వీసా రుసుము భారీ పెంపు, యాక్సెంచర్ ఫలితాల మధ్య ఐటీ కంపెనీల షేర్లు సమీప కాలంలో నష్టపోవచ్చు. యాక్సెంచర్ భవిష్యత్ ఆదాయ అంచనా స్తబ్దుగా ఉండటం, ఐటీ సేవలకు గిరాకీలో మార్పు ఉండకపోవచ్చని సూచిస్తోంది.

వాహనాల బుకింగ్‌లు పెరుగుతుండడం ఈ రంగానికి కలిసొచ్చే అంశం. చిన్న కార్ల భారీ అమ్మకాలు.. జీఎస్‌టీ రేటు తగ్గింపు వల్లా, లేక కొనుగోలుదార్ల ధోరణి మారుతోందా అన్నది తేలాల్సి ఉంది. హీరో మోటోకార్ప్, ఐషర్‌లపై విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు.

బ్రాండెడ్, పేటెంట్ ఔషధాలపై అమెరికా 100% టారిఫ్ వల్ల నిఫ్టీ ఫార్మా సూచీ ప్రతికూలంగా, ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. స్వల్పకాలానికి ఈ రంగ సెంటిమెంటు బలహీనంగానే ఉండనుంది.

నిఫ్టీ బ్యాంక్ సూచీకి 20 రోజుల చలన సగటు అయిన 54,750 స్థాయి కీలకం కానుంది. దీని దిగువకు వస్తే 54,00053800కు పడిపోవచ్చు. ఒకవేళ ఆ స్థాయి ఎగువన ట్రేడ్ అయితే 55,30055,500కు తిరిగి రావొచ్చు.

వర్షాలు కొనసాగుతున్నందున, సిమెంటు కంపెనీల షేర్లు స్వల్పకాలంలో దిద్దుబాటుకు గురికావొచ్చు. దీపావళి తర్వాతే ధరలు పెంచేందుకు కంపెనీలు ప్రయత్నించొచ్చు.

సానుకూల సంకేతాలున్నా నిఫ్టీ ఎఫ్‌ఎమ్‌సీజీ సూచీ స్థిరీకరణకు గురికావొచ్చు. ఈ సూచీ 56,000పైకి వెళితేనే ధోరణిలో మార్పు వస్తుంది. ఒకవేళ 54,400 మద్దతు స్థాయిని కోల్పోతే సెంటిమెంటు మరింత బలహీనపడొచ్చు.

చమురుగ్యాస్ షేర్లలో ఊగిసలాటకే ఎక్కువ అవకాశం ఉంది. 11,400 స్థాయిని అధిగమిస్తేనే కొంత మార్పు కనిపించొచ్చు. చమురు ధరలు తక్కువ స్థాయిల్లో ఉన్నందున మార్కెటింగ్ కంపెనీలకు ప్రయోజనం కలగొచ్చు.

సమీప కాలంలో లోహ సూచీకి 9,800 పాయింట్ల వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయి పైన ట్రేడింగ్ కొనసాగినంత కాలం, బులిష్ ఫార్మేషన్ కొనసాగొచ్చు. 10,000 పాయింట్లు కీలక నిరోధ స్థాయిగా కొనసాగొచ్చు.

టెలికాం షేర్లు చాలా తక్కువ శ్రేణిలోనే చలించొచ్చు. ఏజీఆర్ బకాయిలపై వొడాఫోన్ ఐడియా దాఖలు చేసిన క్యాష్ పిటిషన్‌పై అక్టోబరు 6న సుప్రీంకోర్టులో జరిగే విచారణ ప్రభావం చూపుతుంది.

ఇప్పటికే అధిక విలువలకు చేరినందున యంత్రపరికరాల షేర్లు ఒక శ్రేణిలోనే చలించొచ్చు. లాభాల స్వీకరణకు అవకాశం ఉన్నా.. మరీ ఎక్కువగా ఏమీ నష్టపోకపోవచ్చు.

# అమెరికా టారిఫ్‌లతో భారత్ వృద్ధికి ఇబ్బందే



కోల్‌కతా: భారతీయ వస్తు దిగుమతులపై అమెరికా విధించిన అధిక టారిఫ్‌లతో మన దేశ వృద్ధికి ఇబ్బందులు తలెత్తవచ్చని క్రిసిల్ ఇంటెలిజెన్స్ సెప్టెంబరు నివేదికలో వెల్లడించింది. ఈ టారిఫ్‌ల వల్ల భారతీయ వస్తు ఎగుమతులు, పెట్టుబడులపై ప్రభావం పడుతుందని తెలిపింది. అయితే సానుకూల ద్రవ్యోల్బణం, రేట్ల కోతల వల్ల దేశీయ వినియోగం పెరగడంతో వృద్ధికి కొంత మద్దతు లభించే అవకాశం ఉందని వివరించింది. 2025-26 తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో దేశ జీడీపీ వృద్ధి 5 త్రైమాసికాల గరిష్ఠమైన 7.8 శాతానికి చేరింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఇది 7.4 శాతంగా నమోదైన సంగతి విదితమే. సాధారణ(నామినల్) జీడీపీ వృద్ధి మాత్రం 10.8 శాతం నుంచి 8.8 శాతానికి పరిమితం కావడం గమనార్హం. వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఈ ఆర్థిక సంవత్సరంలో 3.5 శాతానికి పరిమితం కావొచ్చని నివేదిక అంచనా వేసింది. 2024-25లో ఇది 4.6 శాతంగా నమోదైంది.వ్యవసాయ వృద్ధి ఆరోగ్యకరంగా ఉండటంతో ద్రవ్యోల్బణం అదుపులోనే ఉంటుందని నివేదిక తెలిపింది. అయితే అధిక వర్షా ల ప్రభావం ఈ రంగంపై ఎలా ఉంటుందనేది మదింపు చేయాల్సి ఉందని పేర్కొంది.ముడి చమురు ధరలు తక్కువగా ఉండటం, అంతర్జాతీయంగా కమొడిటీ ధరలు సానుకూలంగా ఉండటంతో ఆహారేతర ద్రవ్యోల్బణం కూడా పరిమిత శ్రేణిలోనే ఉండొచ్చని క్రిసిల్ ఇంటెలిజెన్స్ వెల్లడించింది.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్వహించబోయే ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లో ఇంకోసారి రేట్ల కోతకు మొగ్గు చూపొచ్చని నివేదిక అంచనా వేసింది. 2025 ఫిబ్రవరి-జూన్ మధ్య కాలంలో కేంద్ర బ్యాంక్ ద్రవ్య పరపతి విధాన కమిటీ(ఎంపీసీ) రెపో రేటును 100 బేసిస్ పాయింట్లు (1 శాతం) తగ్గించింది.

## ధన పిశాచి రాబోతోంది!



సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న తాజా పా న్స్ ఇండియా సినిమా 'జటాధర'. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సోనాక్షీ సిన్హా, దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్, ఇంద్రకృష్ణ, రవిప్రకాశ్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో జీ స్టూడియోస్‌పై ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్స్ నారంగ్, అరుణ అగర్వాల్, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు.

ఈ చిత్రం నవంబరు 7న విడుదల కానుంది. సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా నుంచి 'ధన పిశాచి రాబోతోంది' అంటూ ఓ సాంగ్‌ని విడుదల చేయనున్నట్లు ప్రకటిస్తూ సోనాక్షీ సిన్హా పోస్టర్‌ని విడుదల చేశారు. "సెప్టెంబర్ 30న ధన పిశాచి రాబోతోంది.. చెడు నయా అవతారాన్ని చూసేందుకు సిద్ధంగా ఉండండి" అంటూ క్యాప్షన్‌ని జత చేశారు మేకర్స్. ఇక ఈ పోస్టర్‌ని బట్టి చూస్తే డబ్బు అంటే పిచ్చి ఉన్న పాత్రలో సోనాక్షి కనిపించనున్నారని తెలుస్తోంది. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: అక్షయ్ కేజ్రీవాల్, కుసుమ్ అరోరా, క్రియేటివ్ ప్రొడ్యూసర్: దివ్యా విజయ్.

# మేము సైనికులం... శ్రీకృష్ణుడి భక్తులం



బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న పీరియాడిక్ వార్ చిత్రం '120 బహదూర్'. ఆయన, రితేశ్ సిధ్వాని, అమిత్ చంద్ర సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాకి రజనీశ్ ఘాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా చిత్రబృందం సామాజిక మాధ్యమాల వేదికగా ఈ సినిమా నుంచి "పరాక్రమం, దేశభక్తి, బలిదాన్.. రెజాంగ్ లా వీరుల పరాక్రమం, త్యాగాన్నిస్మరించుకుంటూ" రెండవ అధికారిక టీజర్‌ను విడుదల చేసింది. ఈ టీజర్ 1962 యుద్ధంలో పోరాడిన వీర సైనికులకు నివాళి అంటూ లతా మంగేష్కర్ ఆలపించిన ఐకానిక్ గీతం "ఏ మేరే వతన్ కే లోగో"తో ప్రారంభమైంది.

టీజర్‌లోని సంభాషణలు.."మీరందరూ రైతు బిడ్డలు..మీ పూర్వీకులు కరవు, వరదలతో పోరాడటం మీరు చూశారు. మీ భూమికోసం పోరాటం..మీ రక్తంలో ఉంది. ఈసారి ఇది కేవలం భూమి గురించే కాదు. మన మాతృభూమి కోసం. మేము సైనికులం, శ్రీకృష్ణుడి భక్తులం... యుద్ధానికి వెళ్లే ముందు మనం ఆయన పేరు పిలుస్తాము. భరత మాత ప్రతిబిడ్డ యుద్ధభూమిలో వందమందికి సమానం" అంటూ సైనికుల యుద్ధ నాటకంతో ఆద్యంతం ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఫర్హాన్ అక్తర్ సైనికుడిగా కనిపించనున్న ఈ సినిమాలో రాశీఖన్నా ప్రత్యేకపాత్రలో అలరించనుంది. 1962 ఇండియాచైనా మధ్య జరిగిన రెజాంగ్ లా యుద్ధానికి నాయకత్వం వహించిన మేజర్ షైతాన్ సింగ్ జీవితం ఆధారంగా రూపొందుతోందీ చిత్రం. ఈ సినిమా నవంబరు 21న థియేటర్లలో విడుదల కానుంది.

# ప్రయాణానికి 'పెద్ది'నిమిదేళ్లు



కథానాయకుడిగా రామ్‌చరణ్ ప్రయాణానికి పద్దెనిమిదేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా 'పెద్ది' బృందం ప్రత్యేకంగా ఓ పోస్టర్‌ని విడుదల చేసింది. రామ్‌చరణ్ కథానాయకుడిగా... బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం చిత్రీకరణ చేసుకొంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'పెద్ది' నుంచి ఆశ్చర్యపోయే చాలా విషయాలు షురూ కానున్నాయని చెబుతూ రామ్‌చరణ్ సినీ ప్రయాణానికి శుభాకాంక్షలు తెలిపింది చిత్రబృందం. "మా 'పెద్ది' 18 ఏళ్లు సినీ కెరీర్‌ని పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషాన్నిస్తోంది. వెండితెరపై ఘనమైన వారసత్వాన్ని కొనసాగిస్తూనే, బయట వినయ విధేయలతో మెలుగుతూ తనకంటూ ఓ ప్రత్యేకమైన పంథాను ఏర్పరుచుకున్నారు. 'పెద్ది' ప్రయాణంలో మాకెన్నో ఉత్సాహభరితమైన సందర్భాల్ని ఇచ్చారు" అంటూ చిత్రబృందం సామాజిక మాధ్యమాల్లో పేర్కొంది.

తనయుడు సినీ ప్రయాణంపై తండ్రి చిరంజీవి సంతృప్తి వ్యక్తం చేస్తూ, శుభాకాంక్షలు చెప్పారు. "18 ఏళ్ల కింద 'చిరుత'తో మొదలైన నీ సినీ ప్రయాణం, కోట్లాది అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచినందుకు ఎంతగానో సంతోషిస్తున్నా. నిన్ను తెరపై హీరోగా చూసిన ఆ క్షణం... నాన్నగా నేను ఎప్పటికీ మరిచిపోలేను. నీ క్రమశిక్షణ, కృషి, పట్టుదల, వినయం, అంకితభావం నిన్ను మరింత ప్రత్యేకంగా నిలబెట్టాయి. తండ్రిగా నేను నిన్ను చూసి ఎప్పుడూ గర్వపడుతుంటా. తెలుగు ప్రేక్షకుల అభిమానంతో దేవుని దీవెనలతో మరెన్నో శిఖరాలు నువ్వు అధిరోహించాలని కోరుకుంటున్నా. విజయోస్తు..." అంటూ ఎక్స్‌లో పేర్కొన్నారు. రామ్‌చరణ్ పరిచయ చిత్రం 'చిరుత' 2007 సెప్టెంబరు 27న ప్రేక్షకుల ముందుకొచ్చింది. తొలి చిత్రంతోనే డ్యాన్సుల్లోనూ, ఫైట్స్‌లోనూ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు. రెండో చిత్రం 'మగధీర'తో తిరుగులేని కథానాయకుడిగా అవతరించారు. 'నాయక్', 'ఎవడు', 'ధృవ', 'రంగస్థలం', 'ఆర్ఆర్ఆర్' తదితర సినిమాలతో తనదైన ముద్ర వేశారు.

# కాంతార చాప్టర్ 1లాంటి సినిమా చేయడం సులభం కాదు: ఎన్టీఆర్



"నన్ను ఉడిపి కృష్ణుడు గుడికి తీసుకుని వెళ్లాలని ఎప్పట్నుంచో మా అమ్మగారి ఆకాంక్ష. రిషబ్ సార్ లేకపోయి ఉంటే ఆ దర్శన భాగ్యం కలిగి ఉండేది కాదు. థ్యాంక్స్ చెప్పి, మా మధ్య దూరాన్ని పెంచలేను. మా అమ్మగారి ఆకాంక్షను నెరవేర్చినందుకు ఐ లవ్ యూ సార్. 'కాంతార: చాప్టర్ 1' సినిమా కోసం రిషబ్ ఎంత కష్టపడ్డారో చూశాను. ఈ సినిమా చేయడం అంత సులభం కాదు. రిషబ్ అరుదైన దర్శక-నటుడు. ఆయనలోని డైరెక్టర్ అతన్ని డామినేట్ చేస్తాడా? లేక యాక్టర్ డామినేట్ చేస్తాడా? అనే ఆలోచన నాకు ఉండేది. కానీ సినిమాలోని 24 క్రాఫ్ట్‌స్‌ని రిషబ్ డామినేట్ చేస్తారు" అని ఎన్టీఆర్ అన్నారు.

రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కాంతార: చాప్టర్ 1'. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'కాంతార' సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార: చాప్టర్ 1' చిత్రం తెరకెక్కింది. హోంబలే ఫిలింస్ నిర్మించిన ఈ చిత్రం ఈ అక్టోబరు 2న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో విడుదల కానుంది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఎన్టీఆర్ మాట్లాడుతూ- "మాములుగా ప్రతిసారీ అరిచినట్లుగా ఈసారి మాట్లాడలేను.కొంచెం నొప్పిగా (ఈ మధ్య స్వల్ప గాయం అయింది) ఉంది. నాకు తెలిసి నా వయసు మూడేళ్లో, నాలుగేళ్లో అయ్యుంటుంది. అప్పుడు మా అమ్మమ్మ నన్ను కూర్చోబెట్టి, కుందాపూర్ దగ్గరే మా ఊరు... అంటూ చిన్నప్పుడు ఆమె విన్న కొన్ని కథలు చెప్పింది. ఈ కథ నిజమేనా? ఇది జరిగి ఉంటుందా? అని అర్థమయ్యేది కాదు. కానీ ఆ కథలు ఆసక్తిగా ఉండేవి. ఒక్కసారైనా ఈ గుళిగ ఆట అనేది ఏంటి? ఈ బింజురుళి అంటే ఏమిటో చూడాలని నా చిన్నప్పుడే నాటుకుపోయింది. కానీ ఏ రోజూ అనుకోలేదు. నేను విన్న ఆ కథల నుంచి, నేను విన్న ఆ కథల గురించి ఒక దర్శకుడు ఒక సినిమా తీస్తాడని. ఆ దర్శకుడు ఎవరో కాదు... నా సోదరుడు రిషబ్ శెట్టి. నేను విన్న కథలను సిల్వర్ స్క్రీన్‌పై చూసినప్పుడు నాకు మాటలు రాలేదు.కథ తెలిసి నేనే ఇలా అయిపోతే ఈ కథ కొత్తగా తెలిసినవాళ్లు ఏమయ్యారో అదే 'కాంతార 1' సినిమా రిజల్ట్. ఈ 'కాంతార: చాప్టర్ 1' గొప్ప బ్లాక్‌బస్టర్ చిత్రంగా భారతీయ సినిమా చరిత్రలో ప్రస్ఫుటంగా కనపడాలని ఆ దేవుడిని కోరుకుంటున్నాను. ఈ సినిమాను అక్టోబరు 2న థియేటర్స్‌లో చూడండి. రిషబ్ కష్టాన్ని ఆశీర్వదించి, 'కాంతార: చాప్టర్ 1'ను విజయం బాటవైపు నడిపిస్తారని ఆశిస్తున్నాను" అని అన్నారు. "ఎన్టీఆర్‌గారితో మాట్లాడుతున్నప్పుడు నాకు ఒక బ్రదర్ ఫీలింగ్ కలుగుతుంది. ఈ సినిమాను మీరందరూ థియేటర్స్‌లో చూసి, ఆశీర్వదించి, పెద్ద విజయాన్ని అందించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు రిషబ్ శెట్టి.హోంబలే ఫిలింస్ సహ వ్యవస్థాపకుడు చలువే గౌడ మాట్లాడుతూ- ""కాంతార: చాప్టర్ 1' మన సంస్కృతి, నమ్మకాలు, కథలు, మూలాలకు నివాళి" అని చెప్పారు. "ఈ సినిమా చూసిన ఓ నలుగురు పెద్దవాళ్లు 'ఈ సినిమా స్పెల్‌బౌండ్' అని చెప్పారు. 'కాంతార: చాప్టర్ 1' పెద్ద చిత్రం అవుతుంది. ఇక వచ్చే నెల ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ సినిమా కొత్త షెడ్యూల్ ప్రారంభమవుతుంది. ఈ సినిమా నెక్స్ట్ లెవల్లో ఉంటుంది" అని మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్ పేర్కొన్నారు. "'కాంతార' సినిమాల కోసం రిషబ్ ఐదేళ్ళుగా కష్టపడుతున్నారు" అని కాస్ట్యూమ్ డిజైనర్, రిషబ్ భార్య ప్రగతి అన్నారు. "కాంతార: చాప్టర్ 1' తెలుగు వెర్షన్‌లోనూ రెండు పాటలు రాశాను" అని చెప్పారు రాంబాబు గోసాల. మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశి, ప్రొడక్షన్ డిజైనర్ బంగ్లన్ తదితరులు పాల్గొన్నారు.

# 'కరూర్ తొక్కిసలాట'.. పూరి జగన్నాథ్ కీలక నిర్ణయం!

తమిళనాడులో నటుడు, టీవీకే అధినేత విజయ్ రాజకీయ సభ పెను విషాదాన్ని మిగిల్చింది. శనివారం సాయంత్రం కరూర్ జిల్లా వెలుచామైపురం వద్ద జరిగిన ర్యాలీలో తొక్కిసలాట జరిగి దాదాపు 40 మంది మరణించారు. పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో దర్శకుడు పూరి జగన్నాథ్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. తన కొత్త సినిమా టైటిల్ అనౌన్స్ మెంట్, టీజర్ విడుదలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.


డబుల్ ఇస్మార్ట్ శంకర్ తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న పూరి.. ప్రస్తుతం విజయ్ సేతుపతితో ఓ పాన్ ఇండియా సినిమాను తెరకెక్కిస్తున్నాడు. పూరిసేతుపతి అనే వర్కింగ్ టైటిల్‌తో షూటింగ్ కూడా ప్రారంభించారు. ఈ రోజు (సెప్టెంబర్ 28)న చెన్నైలో టైటిల్, టీజర్ రిలీజ్ ఈవెంట్ నిర్వహించాల్సి ఉంది. ఈ మేరకు చిత్ర యూనిట్ పోస్టర్ కూడా రిలీజ్ చేసింది. అయితే కరూర్ తొక్కిసలాట ఘటనతో తమిళనాడులో విషాద ఛాయలు అలుముకోవడంతో పూరి.. ఈ ఈవెంట్‌ని క్యాన్సిల్ చేశారు.

సెప్టెంబర్ 27వ తేదీన తమిళనాడు కరూరులో టీవీకే సభలో జరిగిన దుర్ఘటన కారణంగా ఈరోజు చెన్నైలోని గ్రీన్ పార్క్ హోటల్ లో జరగాల్సిన పూరీ సేతుపతి టైటిల్ , టీజర్ లాంచ్ ఈవెంట్ ను క్యాన్సిల్ చేస్తున్నాం. త్వరలోనే కొత్త తేదీ ప్రకటిస్తాం'అంటూ ఒక ప్రకటన రిలీజ్ చేశారు. కాగా, ఈ చిత్రానికి 'స్లమ్ డాగ్' అనే టైటిల్ పెట్టినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త నటించగా.. టబు, విజయ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు



## ప్రేమ విహారం

ఇటలీ వీధుల్లో ప్రేమవిహారం చేస్తున్నారు హీరోయిన్ రష్మికా మందన్నా. షాహిద్ కపూర్, కృతీ సనన్, రష్మికా మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న యూత్‌ఫుల్ లవ్ అండ్ ఎమోషనల్ డ్రామా 'కాక్‌టైల్ 2'. హోమి అడజానియా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం ఇటలీలో జరుగుతోందని తెలిసింది. షాహిద్ కపూర్, రష్మికా మందన్నా, కృతీ సనన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ముఖ్యంగా షాహిద్ కపూర్, రష్మికల మధ్య ప్రేమ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. అలాగే ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, సంజయ్ దత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారని బాలీవుడ్ సమాచారం. ఇటలీ షూటింగ్ షెడ్యూల్‌లో టాకీ పార్టుతో పాటు సాంగ్స్‌ని కూడా చిత్రీకరించాలని ప్లాన్ చేశారని తెలిసింది. విదేశాల్లోనే ఈ సినిమా మేజర్ షూటింగ్ జరుగుతుందని బాలీవుడ్ భోగట్టా. దినేష్ విజన్, లవ్ రంజన్ నిర్మిస్తున్న ఈ 'కాక్‌టైల్ 2' సినిమా వచ్చే ఏడాది ద్వితీయార్థంలో రిలీజ్ కానుంది. ఇక సైఫ్ అలీఖాన్, దీపికా పదుకోన్, డయానా పెంటీ ప్రధాన పాత్రధారులుగా హోమి అడజానియా దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ మూవీ 'కాక్‌టైల్ (2012)'కి సీక్వెల్‌గా 'కాక్‌టైల్ 2' చిత్రం తెరకెక్కుతోంది



# ఆసియా కప్ విజేతగా భారత్



ఇది కదా అసలు సిసలు మజా అంటే.. ఆసియాకప్ ఫైనల్లో నూ దాయాది పాకిస్థాన్ ప్రత్యర్థిగా నిలిచిన వేళ.. ముచ్చటగా మూడోసారీ టీమిండియా తిరుగులేని పంచ్ ఇస్తుంటే.. అంతకు మించిన ఆనందం భారత క్రీడాభిమానికేముంటుంది. అయితే 146 పరుగుల స్వల్ప ఛేదనలో సూర్య సేన ఓ దశలో 20/3 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దెబ్బకు అందరికీ ఫలితంపై ఏ మూలో సందేహం. కీలక ఫైనల్లో తడబాటు తప్పదా? అనిపించింది. కానీ క్లిష్టంగా మారిన పిచ్‌పై తెలుగు తేజం తిలక్ వర్మ చూపిన తెగింపు వహ్వా అనిపించక మానదు. ఆఖరి ఓవర్ వరకు పట్టుదలగా నిలిచిన తను భారత్ ఖాతాలో తొమ్మిదో టైటిల్‌ను వేసి దేశాన్ని సంబరాల్లో ముంచాడు..

దుబాయ్: ఆసియాకప్ టీ20 టోర్నమెంట్‌లో భారత క్రికెట్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. బౌలర్లు విశేషంగా రాణించిన చోట.. బ్యాటర్లు కాస్త తడబడినా తిలక్ వర్మ (53 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 69 నాటౌట్) అజేయంగా నిలిచాడు. తద్వారా పాకిస్థాన్‌కు వరుసగా మూడో ఓటమిని రుచి చూపిస్తూ భారత్ 5 వికెట్ల తేడాతో గెలిచింది. అలాగే టోర్నీలో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి కప్‌ను గెలవడం విశేషం. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 19.1 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు సాహిబ్‌జాదా ఫర్హాన్ (38 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 57), ఫఖర్ జమాన్ (35 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 46), సయీమ్ అయూబా (14) మాత్రమే ఫర్వా లేదనిపించగా.. ఎనిమిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. స్పిన్నర్లు కుల్దీప్‌నకు నాలుగు.. అక్షర్, వరుణ్, పేసర్ బుమ్రాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 150 పరుగులు చేసి గెలిచింది. దూబే (22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 33), శాంసన్ (21 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 24) సహకరించారు. అష్రాఫ్‌కు మూడు వికెట్లు దక్కాయి.

స్వేచ్ఛ

తిలక్ నిలబెట్టాడు..

పాక్ విధించిన స్వల్ప ఛేదనలో భారత్‌కు ఆరంభంలోనే గట్టి ఝలక్‌లు తగిలినా తిలక్ వర్మ ఎదురొడ్డి నిలిచాడు. అతడికి శాంసన్, దూబే సహకరించారు. తాజా టోర్నీలో ఎదురు లేకుండా సాగిన ఓపెనర్ అభిషేక్ (5)ను కట్టడి చేయడంలో ఈసారి పాక్ బౌలర్లు సఫలమయ్యారు. రెండో ఓవర్‌లో పేసర్ అష్రాఫ్ స్లోబాల్‌ను సిక్సర్‌గా మలిచే ప్రయత్నంలో తను క్యాచ్ అవుటయ్యాడు. ఇక తర్వాతి ఓవర్‌లోనే కెప్టెన్ సూర్య (1) క్యాచ్‌ను కెప్టెన్ సల్మాన్ అద్భుతంగా పట్టేశాడు. దీనిపై రివ్యూ కోరినా ఫలితం లేకపోయింది. పేసర్ షహీన్ ఈ వికెట్ తీశాడు. అటు పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న ఓపెనర్ గిల్ (12) ఈ క్లిష్ట పరిస్థితిలో నిలుస్తాడని ఆశించినా అతడూ నిరాశపరిచాడు. అష్రాఫ్ ఓవర్‌లోనే మిడాఫ్‌లో రౌఫ్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో తొలి నాలుగు ఓవర్లలోనే జట్టు 3 వికెట్లు కోల్పోయింది. అప్పటికి స్కోరు 20 పరుగులే కావడం గమనార్హం. అయితే ఈ దశలో తిలక్‌శాంసన్ జోడీ ఆదుకునే ప్రయత్నం చేసింది. ఆరో ఓవర్‌లో తిలక్ 4,6తో 11 రన్స్ రావడంతో పవర్‌ప్లేలో జట్టు 36/3తో నిలిచింది. కానీ పిచ్ పరిస్థితిని బట్టి వీరు రిస్కీ షాట్లకు వెళ్లకుండా, అడపాదడపా బౌండరీలతో పరుగులను రాబట్టారు. తొమ్మిదో ఓవర్‌లో శాంసన్ క్యాచ్‌ను తలత్ జారవిడిచాడు. స్పిన్నర్లు అబ్రార్, సయీమ్ ఓవర్లలో వీరు చెరో సిక్సర్‌తో ఆకట్టుకున్నారు. కానీ చక్కగా కుదురుకున్న ఈ జోడీని 13వ ఓవర్‌లో అబ్రార్ విడదీశాడు. శాంసన్ క్యాచ్‌ను ఫర్హాన్ పట్టేయడంతో నాలుగో వికెట్‌కు 57 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. డెత్ ఓవర్లలో తిలక్‌దూబే ద్వయం జోరు పెంచింది. 15వ ఓవర్‌లో అతడి 4,6.. దూబే 4తో 17 రన్స్ వచ్చాయి. తర్వాతి ఓవర్‌లోనే దూబే సిక్సర్ బాదగా తిలక్ 41 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. కానీ 17వ ఓవర్‌లో పేసర్ షహీన్ కేవలం ఆరు పరుగులే ఇచ్చి ఉత్కంఠ పెంచాడు. అయితే దూబే సిక్సర్‌తో 18వ ఓవర్‌లో 13 రన్స్ వచ్చాయి. 19వ ఓవర్‌లో దూబే అవుటైనా.. ఆఖరి ఓవర్‌లో 10 రన్స్ కావాల్సిన వేళ తిలక్ 6, రింకూ (4 నాటౌట్)తో మ్యాచ్‌ను అద్భుతంగా ముగించారు.

స్పిన్ ధాటికి విలవిల

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఇన్నింగ్స్ ఆరంభానికి, ముగింపునకు పొంతన లేకుండా సాగింది. ఓపెనర్లు ఫర్హాన్, ఫఖర్ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి పరుగులు రాబట్టడంతో 180+ స్కోరు ఖాయమనిపించింది. అటు పేస్, స్పిన్ తేడా లేకుండా ఫర్హాన్‌గా బ్యాట్ ఝుళిపించాడు. అయితే తొలి పది ఓవర్ల పాటు పాక్ ఆధిపత్యమే సాగినా..స్పిన్నర్లు సరైన సమయంలో వికెట్లను పడగొట్టి భారత్‌కు రిలీఫ్‌నందించారు. కుల్దీప్ అయితే తన చివరి రెండు ఓవర్లలో ఏడు పరుగులే ఇచ్చి నాలుగు వికెట్లు తీయడం విశేషం. ఫీల్డింగ్‌లోనూ భారత్ అదుర్స్ అనిపించుకుంది. హార్దిక్ లేకపోవడంతో శివమ్ దూబే కొత్త బంతితో బౌలింగ్ ఆరంభించాడు. అటు బుమ్రాను మాత్రం ఫర్హాన్ ఎప్పటిలాగే అవలీలగా ఆడేశాడు. అతడు వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో 4,6తో 13 రన్స్ రాబట్టాడు. దీంతో పవర్‌ప్లేలో పాక్ 45 రన్స్ సాధించింది. అనంతరం కుల్దీప్ రెండు వరుస ఓవర్లలో ఫర్హాన్ ఒక్కో సిక్సర్‌తో ఒత్తిడి పెంచడమే కాకుండా, 35 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే ఈసారి తను గన్ సెల్యూట్ సంబరాల జోలికి మాత్రం పోలేదు. ఇక పదో ఓవర్‌లో మరో సిక్సర్‌తో జోరు చూపిన ఫర్హాన్‌ను వరుణ్ దెబ్బతీశాడు. ‘పుల్’తో భారీ షాట్‌కు ప్రయత్నించిన తను డీప్ మిడ్ వికెట్‌లో తిలక్‌కు క్యాచ్ ఇచ్చాడు. అప్పటికే తొలి వికెట్‌కు 84 పరుగులు జత చేరాయి. వచ్చీ రాగానే సయీమ్ అయూబ్ రెండు ఫోర్లతో ఆకట్టు కోగా.. ఫఖర్ మరో ఫోర్‌తో పాక్ 12 ఓవర్లలో వంద పరుగులతో పటిష్టంగా కనిపిం చింది. అయితే 13వ ఓవర్ నుంచి స్పిన్నర్ల ఉచ్చులో చిక్కుకుని పాక్ బ్యాటర్లు విలవిల్లాడారు. కుల్దీప్, అక్షర్, వరుణ్ తమ వరుస ఓవర్లలో వికెట్లను పడగొడుతూనే పోయారు. 17వ ఓవర్‌లోనైతే కుల్దీప్ ఏకంగా ముగ్గురిని పెవిలియన్‌కు చేర్చాడు. మొత్తంగా స్పిన్నర్ల ధాటికి 33 రన్స్ వ్యవధిలో పాక్ చివరి 8 వికెట్లను కోల్పోయింది.

ఇద్దరు కెప్టెన్లు చెరొకరితో..

దుబాయ్: ఫైనల్ మ్యాచ్ టాస్ సమయంలో అరుదైన దృశ్యం చోటు చేసుకుంది. సహజంగా టాస్ పడ్డాక ఇరు జట్ల కెప్టెన్లు అక్కడున్న ప్రెజెంటర్‌తో తమ అభిప్రాయాలను పంచుకుంటారు. కానీ అంతర్జాతీయ క్రికెట్‌లో తొలిసారిగా టాస్ ఇంటర్వ్యూను ఇద్దరు మాజీ ఆటగాళ్లు నిర్వహించడం గమనార్హం. భారత కెప్టెన్ సూర్యకుమార్ రవిశాస్త్రితో మాట్లాడగా, పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా.. వకార్ యూనిస్‌తో సంభాషించాడు. వాస్తవానికి సూర్య తమతో షేక్‌హ్యాండ్ నిరాకరించడంతో పాకిస్థాన్ జట్టు భారత్‌పై ఎలాగైనా పైచేయి సాధించాలనే కసితో ఉన్నట్టుంది. అందుకే టాస్ అప్పుడు రెగ్యులర్ ప్రెజెంటర్ రవిశాస్త్రితో తమ కెప్టెన్ సల్మాన్ మాట్లాడడని తెగేసి చెప్పింది. దీంతో అతడి స్థానంలో తటస్థ వ్యక్తిని నియమించాలని ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) బీసీసీఐని కోరింది. కానీ అందుకు భారత క్రికెట్ బోర్డు ససేమిరా అంది. అందుకే మధ్యేమార్గంగా శాస్త్రితో పాటు పాక్ మాజీ పేసర్ వకార్ యూనిస్‌ను కూడా టాస్ సమయంలో పంపారు.

పైక్రాఫ్ట్‌ను మార్చేశారు..

దుబాయ్: భారత్‌పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన ఆసియాకప్ ఫైనల్ మ్యాచ్‌కు రెఫరీగా ఆండీ పైక్రాఫ్ట్‌ను మార్చారు. అతడి స్థానంలో రిచీ రిచర్డ్‌సన్ బాధ్యతలు నిర్వహించాడు. ఈ రెండు జట్ల మధ్య జరిగిన గ్రూప్, సూపర్ 4 మ్యాచ్‌లకు రెఫరీగా పైక్రాఫ్ట్ వ్యవహరించాడు. అయితే ఈనెల 21న భారత్‌తో మొదటిమ్యాచ్ తర్వాత పాక్ జట్టు పైక్రాఫ్ట్‌పై ఫిర్యాదు చేసింది. టాస్ సమయంలో పాక్ కెప్టెన్ సల్మాన్‌తో సూర్యకుమార్ కరచాలనం చేయకపోవడం తెలిసిందే. ఫైనల్ మ్యాచ్‌కు మాత్రం ఎటువంటి వివాదం చోటు చేసుకోకుండా రిచీ రిచర్డ్‌సన్‌ను రెఫరీగా నియమించింది.

ఒకే ఆసియాకప్ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కుల్దీప్ యాదవ్

పాక్‌పై తొమ్మిది సార్లు ఛేదనకు దిగిన ప్రతీసారి భారత్ గెలవడం విశేషం.

2019, డిసెంబరు నుంచి శివమ్ దూబే పాల్గొన్న చివరి 34 టీ20 మ్యాచ్‌ల్లోనూ భారత్ ఓడిపోలేదు.

పురుషుల టీ20 టోర్నీలను ఓటమి లేకుండా భారత్ దక్కించుకోవడం ఇది నాలుగోసారి. 2016 ఆసియాకప్, 2023 ఆసియాగేమ్స్, 2024 టీ20 వరల్డ్‌కప‌లోనూ ఇలాగే గెలిచింది.

ఆపరేషన్ సింధూర్..

‘మైదానంలో ఆపరేషన్ సింధూర్. అదే ఫలితం.. భారత విజయం. క్రికెటర్లకు అభినందనలు’

ప్రధాని నరేంద్ర మోదీ



## స్కోరుబోర్డు

పాకిస్థాన్ : ఫర్హాన్ (సి) తిలక్ (బి) వరుణ్ 57, ఫఖర్ జమాన్ (సి) కుల్దీప్ (బి) వరుణ్ 46, అయూబ్ (సి) బుమ్రా (బి) కుల్దీప్ 14, మహ్మద్ హారిస్ (సి) రింకూసింగ్ (బి) అక్షర్ 0, సల్మాన్ ఆఘా (సి) శాంసన్ (బి) కుల్దీప్ 8, హుస్సేన్ తలత్ (సి) శాంసన్ (బి) అక్షర్ 1, మహ్మద్ నవాజ్ (సి) రింకూసింగ్ (బి) బుమ్రా 6, షహీన్ షా (ఎల్బీ) కుల్దీప్ 0, ఫహీమ్ అష్రఫ్ (సి) తిలక్ (బి) కుల్దీప్ 0, హారిస్ రౌఫ్ (బి) బుమ్రా 6, అబ్రార్ అహ్మద్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు : 7; మొత్తం 19.1 ఓవర్లలో 146 ఆలౌట్ ; వికెట్లపతనం : 1-84, 2-113, 3-114, 4-126, 5-131, 6-133, 7-134, 8-134, 9-141 ; బౌలింగ్ : దూబే 3-0-23-0, బుమ్రా 3.1-0-25-2, వరుణ్ 4-0-30-2, అక్షర్ 4-0-26-2, కుల్దీప్ 4-0-30-4, తిలక్ వర్మ 1-0-9-0.

భారత్ : అభిషేక్ (సి) రౌఫ్ (బి) ఫహీమ్ అష్రఫ్ 5, గిల్ (సి) రౌఫ్ (బి) ఫహీమ్ అష్రఫ్ 12, సూర్యకుమార్ (సి) ఆఘా (బి) షహీన్ షా 1, తిలక్ వర్మ (నాటౌట్) 69, శాంసన్ (సి) ఫర్హాన్ (బి) అబ్రార్ 24, దూబే (సి) షహీన్ షా (బి) ఫహీమ్ అష్రఫ్ 33, రింకూసింగ్ (నాటౌట్) 4 ; ఎక్స్‌ట్రాలు : 2 ; మొత్తం 19.4 ఓవర్లలో 150/5 ; వికెట్లపతనం : 1-7, 2-10, 3-20, 4-77, 5-137 ; బౌలింగ్ : షహీన్ షా 4-0-20-1, ఫహీమ్ అష్రఫ్ 4-0-29-3, మహ్మద్ నవాజ్ 1-0-6-0, హారిస్ రౌఫ్ 3.4-0-50-0, అబ్రార్ అహ్మద్ 4-0-29-1, అయూబ్ 3-0-16-0.

## ఆ ఇద్దరిపై ఆశలెన్నో..!





సారథిగా, బ్యాటర్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ భారత జట్టుకు ఎంతో ముఖ్యమైన ప్లేయర్. భారత్ చివరగా 2017లో ప్రపంచకప్ ఫైనల్ చేరడంలో ఆమెదే కీలక పాత్ర. అప్పుడు హర్మన్ సెమీఫైనల్లో 171 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్‌తో భారత్‌ను గెలిపించింది. ఫైనల్లో ఓటమి ఇప్పటికీ ఆమెను బాధిస్తూ ఉంటుందనడంలో సందేహం లేదు. ఆ ఒక్క టోర్నీలోనే కాదు.. మొత్తంగా ప్రపంచకప్‌లలో హర్మన్‌ప్రీత్ రికార్డు అద్భుతం. అయిదోసారి ప్రపంచకప్ ఆడుతున్న ఆమె ఇప్పటివరకు ఆ టోర్నీలో 26 మ్యాచ్‌లు, 22 ఇన్నింగ్స్‌ల్లో 51.52 సగటుతో 876 పరుగులు సాధించింది. ఇందులో మూడు సెంచరీలు, నాలుగు అర్ధసెంచరీలు ఉన్నాయి. ప్రపంచ కప్పుల్లో అత్యధిక శతకాలు సాధించిన భారత మహిళగా రికార్డు హర్మన్ పేరిటే ఉంది. మహిళల వన్డేలు, టీ20లు రెంటిలోనూ మూడు వేల పరుగులకుపైగా చేసిన ఏకైక భారత బ్యాటర్ ఆమె. మిడిల్ ఆర్డర్‌లో ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచే హర్మన్ రాణించడం భారత జట్టుకు ఎంతో అవసరం. ఇంగ్లాండ్‌లో ఓ సెంచరీ కొట్టిన ఆమె, ఇటీవల ఆస్ట్రేలియాతో సిరీస్‌లో గొప్పగా రాణించలేదు. అయినా ప్రపంచకప్పుల్లో గొప్ప రికార్డున్న హర్మన్..సొంతగడ్డపైనా అదే జోరు కొనసాగిస్తుందని భారత జట్టు ఆశిస్తోంది.

భీకర ఫామ్‌లో..

ఈ ప్రపంచకప్‌లో భారత జట్టుపై మంచి అంచనాలు ఉన్నాయంటే ప్రధాన కారణం సూపర్ స్టార్ బ్యాటరే స్మృతి మంధాననే. ఈ నంబర్‌వన్ బ్యాటర్ విధ్వంసక ఫామ్‌లో ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు ఆడిన 14 వన్డేల్లో భారత్ 10 నెగ్గడంలో ఆమె ప్రధాన పాత్ర పోషించింది. ధనాధన్ ఇన్నింగ్స్‌లతో అదిరే ఆరంభాలనిస్తోన్న ఆమె.. 2025లో 66.28 సగటుతో 928 పరుగులు చేసింది. ఇందులో నాలుగు శతకాలు ఉన్నాయి. ఈ ఏడాది వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ మంధాననే. తాజాగా ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌తో స్మృతి విధ్వంసం పతాక స్థాయికి చేరింది. మూడు మ్యాచ్‌ల్లో పరుగుల వరద పారించిన ఆమె.. వంద సగటుతో 300 పరుగులు చేసింది. 58, 117, 125 స్కోర్లతో ప్రపంచకప్‌పై అభిమానుల అంచనాలను పెంచేసింది. మూడో వన్డేలో అయితే ఆమె 50 బంతుల్లోనే శతకం బాదింది. గత ప్రపంచకప్ (2022)లో స్మృతి గొప్పగా రాణించింది. ఏడు మ్యాచ్‌ల్లో 46.71 సగటుతో 327 పరుగులు చేసింది. భారత్ తరఫున ఆమే టాప్ స్కోరర్. ఆ టోర్నీ తర్వాత స్మృతి 58.33 సగటు, 99.15 స్ట్రైక్‌రేట్‌తో 2100 పరుగులు చేసింది. ఆ కాలంలో వేరే ఏ బ్యాటర్ కూడా 1800కి మించి పరుగులు చేయలేదు. షాట్ల ఎంపికలో స్పష్టత ఆమెకు ఎంతో ఉపకరిస్తోంది. స్మృతి ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే విశ్వసమరంలో భారత్‌కు తిరుగుండదు.

## శర్మ కాదు..వర్మ



**అభిషేక్ శర్మ.. అభిషేక్ శర్మ.. ఈసారి ఆసియా కప్ ఆరంభమైనప్పటి నుంచి తన పేరే మార్మోగుతోంది. లీగ్ దశలో, ఆపై సూపర్-4లో మెరుపు ఇన్నింగ్స్‌లతో మ్యాచ్‌లను ఏకపక్షం చేసిన ఘనత ఈ ఓపెనింగ్ బ్యాటర్ సొంతం. పాకిస్థాన్‌తో ఫైనల్ ముంగిట కూడా చర్చలన్నీ అతడి చుట్టూనే తిరిగాయి. అభిషేక్‌ను త్వరగా ఔట్ చేస్తే మ్యాచ్ పాక్‌దే అంటూ ఆ జట్టు మాజీలు, అభిమానులు విశ్లేషణలు చేశారు. వాళ్లు కోరుకున్నట్లే అభిషేక్ ఆరంభంలోనే ఔటైపోయాడు. కానీ శర్మను ఆపగలిగారు కానీ.. వర్మ రూపంలో రాబోయే ముప్పును పాక్ ఊహించలేకపోయింది. ఫైనల్లో మేటి ఇన్నింగ్స్‌తో జాతీయ హీరోగా మారిపోయాడు తెలుగు కుర్రాడు తిలక్ వర్మ.**

ఐపీఎల్‌లో ముంబయి తరఫున మెరుపులతో 20 ఏళ్ల వయసులోనే భారత టీ20 జట్టులో చోటు దక్కించుకున్న తిలక్.. ఆరంభం నుంచి నిలకడగా ఆడుతున్నాడు. అయితే జట్టులో స్టార్ ఆటగాళ్ల మధ్య అతడికి రావాల్సినంత గుర్తింపు రాలేదు. మిడిలార్డర్లో ఆడడం కూడా తిలక్ పేరు పెద్దగా చర్చల్లో రాకపోవడానికి కారణం. అయితే నిరుడు దక్షిణాఫ్రికా పర్యటనలో వరుసగా రెండు శతకాలతో సంచలనం రేపాడీ తెలుగు కుర్రాడు. ప్రస్తుత ఆసియా కప్‌లోనూ అతను నిలకడగా రాణించాడు. పాక్‌పై గ్రూప్ దశలో 31 పరుగులు చేసిన తిలక్.. సూపర్ 4లో ఆ జట్టుపై 30 పరుగులతో అజేయంగా నిలిచాడు. శ్రీలంకపై చివరి సూపర్4 మ్యాచ్‌లో 49 పరుగులతో అజేయంగా నిలిచాడు. అయితే ఇవన్నీ ఒకెత్తయితే.. ఫైనల్ ఇన్నింగ్స్ మరో ఎత్తు. ఫైనల్ మ్యాచ్‌లో, చిరకాల ప్రత్యర్థిపై, జట్టు కష్టాల్లో ఉండగా గొప్ప పట్టుదలతో క్రీజులో నిలిచి తిలక్ జట్టును గెలిపించిన తీరు గురించి ఎంత కొనియాడినా తక్కువే. 20 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి జట్టు పూర్తిగా ఆత్మరక్షణలో పడ్డపుడు.. తనపైనే కాక సహచరుడు సంజు మీద కూడా ఒత్తిడి ఎగిరిపోయేలా చేశాడు తిలక్.2 వికెట్లతో భారత్‌ను గట్టి దెబ్బ తీసిన ఫహీమ్ అష్రాఫ్ బౌలింగ్‌లో 4, 6తో పరిస్థితిని మార్చేశాడు. ఫైన్‌లెగ్‌లో సిక్స్ అయితే కళ్లు చెదిరిపోయేదే. ఈ షాట్‌ను మ్యాచ్‌లో కీలక మలుపుగా చెప్పొచ్చు. ఆ తర్వాత అబ్రార్ బౌలింగ్‌లో మిడ్‌వికెట్‌లో స్వీప్‌తో కొట్టిన ఫ్లాట్ సిక్సర్ కూడా భారత అభిమానులకు చాన్నాళ్లు గుర్తుంటుంది. ఒక భారీ షాట్ ఆడగానే.. మళ్లీ ఆవేశపడకుండా సంయమనంతో సింగిల్స్ తీయడం.. స్ట్రైక్ రొటేట్ చేస్తూ భాగస్వామ్యాలు నిర్మించడం తిలక్ పరిణతికి నిదర్శనం. ఏ దశలోనూ అతను సంయమనం కోల్పోలేదు. ఒక లెక్క ప్రకారం సమయోచితంగా షాట్లు ఆడాడు. అభిషేక్, సూర్య స్లో బంతులకు బోల్తా కొట్టిన నేపథ్యంలో రవూఫ్ 15వ ఓవర్లో తిలక్‌కు కూడా అలాంటి బంతినే సంధించాడు. కానీ అది స్టాండ్స్‌లో తేలింది. సంజు ఔటయ్యాక కూడా అతను ఏకాగ్రత్త కోల్పోలేదు. ఒత్తిడికి గురి కాకుండా దూబెతో మరో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన తిలక్.. జట్టును గెలిపించి కానీ మైదానాన్ని వీడలేదు. తిలక్ ఇప్పటికే టీ20ల్లో కొన్ని మేటి ఇన్నింగ్స్‌లు ఆడినప్పటికీ.. తీవ్ర భావోద్వేగాలతో ముడిపడ్డ మ్యాచ్‌లో పాక్‌పై భారత్‌ను గెలిపించి, ఆసియా కప్‌ను అందించిన ఈ అర్ధశతకం అభిమానుల మనసుల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.

## ఆసియా కప్ ట్రోఫీని తీసుకునేందుకు నిరాకరించిన భారత్



ఆసియా కప్ ఫైనల్‌లో దాయాది జట్టు పాకిస్థాన్‌పై భారత్ మరుపురాని విజయం సాధించింది. 41 ఏళ్ల ఆసియా కప్ టోర్నీ చరిత్రలోనే తొలిసారి ఫైనల్‌లో తలపడ్డ ఇరుజట్లలో.. టీమ్ఇండియాదే ఆధిపత్యం. నరాలు తెగే ఉత్కంఠ పోరులో.. భారత్ 5 వికెట్ల తేడాతో గెలిచింది. తిలక్ వర్మ (69*) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో భారత్ ఖాతాలో తొమ్మిదో ఆసియా కప్ టైటిల్ (Asia Cup Title) చేరింది. అయితే మ్యాచ్ అనంతరం భారత జట్టు షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ట్రోఫీని తీసుకునేందుకు భారత ఆటగాళ్లు నిరాకరించారు. పాక్ మంత్రి, ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఉన్న మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా ఇస్తుండడమే ఇందుకు కారణం. ట్రోఫీ, మెడల్స్ తీసుకోకుండానే టీమ్ఇండియా ఆటగాళ్లు డగౌట్‌కు చేరుకున్నారు. భారత్ ట్రోఫీని నిరాకరించినట్లు ప్రెసెంటేటర్ ప్రకటించారు. ఈ నిర్ణయంతో గ్రౌండ్‌కు తీసుకొచ్చిన ట్రోఫీని వెనక్కి తీసుకెళ్లారు. భారత ఆటగాళ్లు ట్రోఫీ లేకుండానే ఆనందంతో పరవశించారు. ఇక ట్రోఫీ గెలిచిన భారత్‌కు రూ. 21 కోట్ల ప్రైజ్ మనీ దక్కింది. ఆటగాళ్లు, సిబ్బందికి ఈ డబ్బులు దక్కనున్నాయి.

ట్రోఫీని గ్రౌండ్ నుంచి వెనక్కి తీసుకెళుతున్న సిబ్బంది

ఈ విజయంతో దేశమొత్తం సంబరాల్లో మునిగి ఉంటుందని సూర్య పేర్కొన్నారు. ఆసియా కప్ ఫైనల్ అనంతరం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ పాల్గొన్నారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ విజయం దేశ ప్రజల ముఖాల్లో చిరునవ్వులు చిందించి ఉంటుందని సూర్య అన్నాడు. ట్రోఫీని తీసుకోకపోవడంపై స్పందిస్తూ.. తన కెరీర్‌లో ఒక విజేత జట్టు ట్రోఫీని నిరాకరించడం బహుశ ఇదే తొలిసారి కావచ్చన్నాడు. అయితే ట్రోఫీ తీసుకునేందుకు తాము అర్హులమే అయినప్పటికీ తిరస్కరించినట్లు చెప్పాడు. ఇక కరచాలనం వివాదం, ట్రోఫీ తీసుకోకపోవడానికి కారణాలపై పాక్ జర్నలిస్టు అడిగిన సమాధానాలను సూర్య దాటవేశాడు. మ్యాచ్ అనంతరం ప్రెసెంటేషన్ కార్యక్రమంలోనూ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడలేదు.

యుద్ధభూమిలోనూ.. మైదానంలోనూ ఒకటే ఫలితం: ప్రధాని మోదీ

పహల్గాం ఉగ్రదాడి.. ‘ఆపరేషన్ సిందూర్’ అనంతరం ఆసియా కప్ జరగడంతో తీవ్రమైన బజ్ ఉంటుందని అనుకున్నప్పటికీ ‘బాయ్‌కాట్’ ట్రెండింగ్‌తో భారత్, పాక్ తొలి మ్యాచ్ వెలవెలబోయింది. తొలి మ్యాచ్‌లో పాక్‌పై భారత్ గెలిచిన అనంతరం ఆ జట్టు క్రికెటర్లకు భారత ఆటగాళ్లు షేక్ హ్యాండ్ ఇవ్వకపోవడంతో వివాదం చెలరేగింది. మ్యాచ్ అనంతరం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడి బాధితులతోపాటు సైన్యానికి ఈ విజయం అంకితం చేస్తున్నట్లు ప్రకటన చేయడంతో పాక్‌కు గాయంపై కారం పోసినంత పనైంది. అనంతరం సూపర్ 4లో మ్యాచ్‌లో పాక్ ఆటగాడు హారిస్ రవూఫ్ ‘ఆపరేషన్ సిందూర్’కు సంబంధించి వెకిలి చేష్టలతో భారత్‌ను కవ్వించాడు. అయితే చచ్చీచెడి పాక్ ఫైనల్ చేరడంతో.. ఇక చిరకాల ప్రత్యర్థుల మ్యాచ్‌కు మళ్లీ క్రేజ్ వచ్చింది. దీంతో ఫైనల్ మ్యాచ్‌కు స్టేడియం నిండిపోయింది. ఇక భారత్ ఫైనల్‌లో గెలిస్తే ఆ దేశం నుంచి ట్రోఫీతీసుకోవడానికి భారత్ నిరాకరించవచ్చనే వార్తలు వచ్చాయి. అనుకున్నట్లుగానే భారత్ పాక్ మంత్రి నఖ్వీ నుంచి ట్రోఫీ తీసుకోవడానికి నిరాకరించింది.